# ఆగమనం

మిట్టమధ్యాహ్న సమయం! నిర్మానుష్యమైన ఆ అరణ్య మార్గంలో ఇరువైపులా పెరిగిన వృక్షాల కొమ్మలు వింజామరలు వీస్తున్నట్లు చల్లనిగాలికి కదులుతూ వాతావరణానికి చల్లదనం ఆపాదిస్తున్నాయి. మబ్బుల చాటున దాగిన సూర్యుడు తన తీక్షణతను తగ్గించుకున్నట్లు తోస్తుంటే పక్షులు సంతోషంగా కిలకిలారావాలు చేస్తూ ఎగురుతున్నాయి. ప్రకృతికాంత ఎవరికో స్వాగతం చెప్పడానికి సిద్ధపడుతున్నట్లు అడవి పూలు జలజలా రాలుతున్నాయి బాటమీద!

“ఎందుకీవేళ ఈ నిర్జనారణ్యంలో ఏదో తెలియని చల్లదనం, ప్రశాంతత చోటు చేసుకున్నాయి? ఎవరి రాకకోసం ఈ పక్షుల కిలకిలారావాలు? ఎక్కడినుండి వీస్తున్నాయి ఈ మలయమారుతాలు? ప్రచండంగా మండిపడే సూర్యుడు ఈవేళ మబ్బుల చాటున దాగి తన వేడిని దాచి పెడుతున్నాడు ఎవరికి ఎండ తగలకూడదని? చిత్రంగా ఉందే?” చెట్టుకొమ్మల్లో దాగి కూర్చుని బాటవైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు ఒక భీకరాకారుడు.

నల్లని రాటుతేలిన మొరటు దేహం, చింతనిప్పుల్లాంటి ఎర్రని కళ్ళు, మెడలో వ్రేలాడుతున్న చేతివేళ్ళ మాల, పగలు చూస్తే రాత్రి కలలో కనిపించి జడిపించే ఆ భీకరాకారం దయాదాక్షిణ్యాలులేని దారిదోపిడీగాడని చెప్పక చెబుతున్నాయి. ఆ దారిన వెళ్ళే బాటసారులను భయపెట్టి, హింసించి వారి సర్వస్వాన్ని కొల్లగొట్టడమే కాక తన ప్రతాపానికి గుర్తుగా వాళ్ళ చేతుల చిటికెన వ్రేళ్ళను నిర్దాక్షిణ్యంగా నరికి తీసుకుని మాలలా మెడలో వేసుకుని తిరిగే ఆ దోపిడీ దొంగే అంగుళిమాలుడు. ఆ పేరు తలచుకుంటే చాలు శ్రావస్తీ పట్టణ ప్రజలు భయంతో కంపించిపోతారు. శ్రావస్తీ నుండి ఇతర ప్రాంతాలకు పనులమీద, వ్యాపారరీత్యా ఆ దారిన వెళ్ళే వాళ్ళనందరినీ మట్టుపెట్టి వారి ధన ప్రాణాలతో చిటికెనవ్రేళ్ళను కూడా దోచుకుపోయే ఆ కఠినాత్ముడిని బంధించడానికి మహారాజు ప్రసేనజిత్తు చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థం కావడంతో క్రమంగా ప్రజలు ఆ దారిన వెళ్ళడం మానుకున్నారు.

వారంరోజులుగా ఎవరూ ఆ దారివెంట రాకపోవడంతో తన కత్తికి పని లేకుండా పోయినందుకు విసుగ్గా నిట్టూర్చాడు నిర్మానుష్యంగా వున్న బాటవైపు చూస్తూ అంగుళిమాలుడు. అతడి మనసులో ఏదో మూల చిన్నగా ఆశ తళుక్కుమంటున్నది.

‘ఈ వేళయినా పెద్ద వర్తకుల గుంపు ఈవైపుగా వస్తే బాగుండును. రావాలి. తప్పకుండా ఎవరైనా వచ్చి తన కత్తికి పని కల్పించాలి. లేకపోతే తనే రాత్రి జనం నివసించే స్థలాలకు వెళ్ళాల్సిందే! తప్పదు మరి! తన జీవనోపాధికి ఇతరులను బలిపెట్టి తీరాలి. అవును! తన ఈ పగ చల్లారేదికాదు. ఈ హింసాకాండ సాగుతూ పోవలసిందే. తననిలా కఠినశిలలా మార్చిన ఈ సమాజంలో ఎవరూ సుఖంగా జీవించకూడదు. ఆవేశం, ఆవేదన మనస్సును కుదిపివేస్తుంటే ఆలోచనలు గతంలోకి పరుగులు తీసాయి.

• • •

“అహింసకా! ఏమిటి నాయనా ఏదో చెప్పాలని సంశయిస్తున్నావు?” కుమారుడివైపు వాత్సల్యంగా చూస్తూ అడిగాడు గర్గుడు, శ్రావస్తీ నగర రాజ పురోహితుడు.

“తండ్రీ! ఇక్కడ నా చదువు పూర్తయిందని తమరే అన్నారు. కానీ ఇంకా ఉన్నత విద్యలను అభ్యసించాలన్న ఆరాటం నాలో అధికమవుతున్నది. అందుకే మీ అనుమతితో తక్షశిలకు వెళ్ళి నా ఆశయం నెరవేర్చుకోవాలనుకుంటున్నాను” వినయంగా తన కోరిక వెల్లడించాడు అహింసకుడు.

**26.5.2002న బుద్ధపూర్ణిమ**

“నీ కోరిక సమంజసమైనదే. తప్పకుండా వెళ్ళి ఉన్నత విద్యలను అభ్యసించు. తక్షశిలలో ఎందరో సమర్థవంతులైన గురువులున్నారు. వారిలో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఆర్యకుల గురుకులంలో చేరి పరిపూర్ణ పాండిత్యంతో తిరిగిరా!” అంటూ అనుమతితోపాటు ఆశీస్సులు ఇచ్చి పంపాడు గర్గుడు.

తనకు నమస్కరించి ఉత్సాహంగా సాగిపోతున్న కుమారుడి వైపు తృప్తిగా చూస్తూ “వినయం, సహనం, ఇతరులకు హాని కలిగించని నైజం అహింసకుని పేరును సార్థకం చేస్తున్నాయి. ఇంతటి బుద్ధిశాలా ప్రజాకంటకుడు కాగలడన్న భవిష్యవాణి, అహింసకుడు పుట్టినప్పుడు కన్పించిన దుశ్శకునాలు అన్నీ ఊరికే భయాందోళనలకు గురి చేసాయి తన హృదయాన్ని! ఇక అవన్నీ మరచిపోవాలి! అహింసకుడు ఎంతో గొప్ప పండితుడు అవుతాడు తక్షశిలలో ఉన్నత విద్యలను అభ్యసించి” అనుకున్నాడు తేలిక పడిన హృదయంతో.

• • •

తక్షశిల చేరి ఆర్యకుల గురుకులంలో స్థానం సంపాదించి కొద్దికాలంలోనే గురువుగారి మన్ననకు పాత్రుడైనాడు అహింసకుడు. ఏకసంధాగ్రాహిలా అన్ని పాఠాలూ చురుకుగా ఆకళింపు చేసుకుని శ్రద్ధాభక్తులతో మెలిగే అతడిని మెచ్చుకుంటూ ఇతర శిష్యులను అతడిని ఆదర్శంగా తీసుకోవాలని గురువుగారు అనడం కొందరు శిష్యులకు ఈర్ష్యాసూయలు కలిగించింది.

“ఈ అహింసకుడు వచ్చినప్పటినుండి గురువుగారిని అతి వినయంతో మంచి చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతడిలో ఏదో దుర్బుద్ధి దాగి వుందని నా అనుమానం” అక్కసు వెళ్ళగక్కుతూ అన్నాడు మైత్రేయుడు తోటివారితో!

“అవును మిత్రమా! సాయం సమయాలలో మనందరం ఆట పాటలతో గడుపుతుంటే మనతో కలవకుండా ఆ అహింసకుడు మాత్రం గురుపత్నికి సహాయం చేసే నెపంతో ఆశ్రమంలో ఉండిపోతున్నాడు. నక్క వినయాలు ప్రదర్శించే అతనిమీద గురుపత్ని కూడా ఎంత అనురాగం ఒలికిస్తుందో మనం చూస్తూనే వున్నాంకదా. నా మనస్సు అసూయతో దహించుకుపోతున్నది. మనలందరినీ కించపరచడానికి కంకణం కట్టుకువచ్చిన ఈ అహింసకుడిని త్వరలోనే ఇక్కడినుండి సాగనంపాలి” అన్నాడు మరో విద్యార్థి ఈర్ష్యతో నిండిన కంఠంతో.

“అందుకొక చక్కని ఉపాయం ఆలోచించాను. వినండి” అందరినీ దగ్గరకు పిలిచి మెల్లగా తన పథకం వివరించాడు మరొక విద్యార్థి. విన్న వాళ్ళ ముఖాలు ఆనందంతో విప్పారాయి.

“అవును. అలాగే చేద్దాం. అహింసకుడి పీడ విరగడైపోతుంది” అనుకున్నారు ఏకగ్రీవంగా.

• • •

“శ్రీరాముడంతటివాడు భార్యను శంకించి అడవులలో విడిచిపెట్టి రమ్మనటం తలచుకుంటే బాధతో హృదయం తల్లడిల్లిపోతుంది నాకు. అందుకే ఉత్తర రామాయణం నాకంత ఆసక్తికరంగా వుండదు. అహింసకా! చదివింది చాలు. ఆ పుస్తకం అవతల పెట్టి ఈ ఆకులు కుట్టిపెట్టు కాస్త” తన సమీపంగా కూర్చుని ఉత్తర రామాయణంలో ఘట్టాన్ని చదివి వినిపిస్తున్న అహింసకుడి వైపుఆప్యాయంగా చూస్తూ అన్నది గోమతి!

“అలాగే తల్లీ! అయినా తమరొక విషయం గ్రహించాలి. శ్రీరామునికి సీతాదేవి మీద ఏమాత్రం శంక లేదు. పరిస్థితుల ప్రాబల్యం, ప్రభువుగా తన కర్తవ్యం ఆయనను వివశుడిని చేసాయి” ఆమె ప్రక్కన కూర్చుని ఆకులు కుడుతూ వివరించడానికి ప్రయత్నిస్తున్నాడు అహింసకుడు.

“సరేలే! నీ మాటే నిజం! వయసులో చిన్నయినా ఓపిగ్గా వివరించడంలో మీ గురువుగారిని మించిపోయావు” చిన్నగా వీపుమీద చరిచి గలగలమంటూ

నవ్వింది గౌతమి.

వాళ్ళకు తెలియకుండా కిటికీలోనుండి చూస్తూ గమనిస్తున్న ఆర్యకుని కనుబొమ్మలు ముడిపడ్డాయి కోపంతో!

''శిష్యులందరూ అనుకుంటున్న మాటలు పట్టి వదంతి కాదు. నిజమేననిపిస్తున్నది. గురుపత్ని అన్న విచక్షణ లేకుండా ఎంత చనువుగా మసలుతున్నాడు అహింసకుడు తన భార్యతో. గురుద్రోహి!'' పళ్లు పటపటలాడిస్తూ లోపలికి ప్రవేశించాడు.

''అహింసకా! గురుద్రోహి! లే...తక్షణం ఇక్కడి నుండి బయటకు వెళ్ళు. నిన్ను గురుకులం నుండి బహిష్కరిస్తున్నాను. నా కళ్ల ముందు నుండి తొలగిపో'' అంటూ అరిచాడు.

ఈ హఠాత్పరిణామానికి నివ్వెరపోతూ ''గురువర్యా! నేనే పాపమూ ఎరుగనే! నన్నెందుకు అకారణంగా బహిష్కరిస్తున్నారు?'' అడిగాడు అహింసకుడు ధైర్యం కూడగట్టుకుని.

''ఏ పాపమూ ఎరుగవా? గురుపత్నితో సరస సల్లాపాలాడే నీకు గురుకులం నుండి బహిష్కరణ చాలదసలు. ఇంతకన్నా కఠినశిక్ష విధించాలి. దయ తలచి వదిలిపెడుతున్నాను. తక్షణం వెళ్లిపో నా కళ్లముందు నుండి.''

''శివ...శివ! పుత్ర సమానుడైన అహింసకుడి మీదనా ఈ నింద మోపడం!'' అంటూ విలపిస్తున్న గౌతమివైపు నిస్సహాయంగా చూసి నమస్కరిస్తూ ''గురువర్యా! మీ ఆజ్ఞకు బద్ధుడినై వెళ్లిపోతున్నాను. కానీ నేను గురుద్రోహిని మాత్రం కాను. ఆ తల్లికి ఇవే నా తుది నమస్కారాలు'' అంటూ వడివడిగా అక్కడి నుండి వెళ్లిపోయాడు అహింసకుడు.

''అడుగో గురుద్రోహి! ఎలా వెళ్లిపోతున్నాడో చూడండి. అతి వినయంగా నటిస్తూ గురువుగారికే ద్రోహం తలపెట్టాడు'' అతనికి వినిపించేలా అరుస్తున్న తోటి విద్యార్థుల ఛీత్కారాలు ఈటెల్లా హృదయాన్ని ఛేదిస్తుంటే ఇంటి ముఖం పట్టాడు అహింసకుడు తన ఆశయం పూర్తి కాకుండానే!

• • •



ఇంటికి తిరిగివచ్చిన అహింసకుని వెంటనంటే వచ్చింది నీలాపనింద కూడా! విషయం అక్కడకు కూడా వ్యాపించడంతో గురుద్రోహం కఠిన శిక్షార్హంగా భావించే ఆ సమాజంలో చివరకు కన్నతండ్రి కూడా అతనికి ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించడం, ఎక్క డకు వెళ్లినా అవహేళనలతో నిందించడం భరించలేక మనశ్శాంతిని వెతుక్కుంటూ అడవిమార్గం పట్టాడు అహింసకుడు. ఆకలితో అలమటిస్తూ సొమ్మసిల్లిపడి పోయాడు ఒక చెట్టు క్రింద.

• • •

''అమ్మయ్య! ఇప్పటికి తేరుకున్నావు? ఎవరి వయ్యా యువకుడా! ఈ మార్గాన వంటరిగా ఎందుకు వచ్చావు?'' పక్కనే కూర్చుని చల్లని నీరు త్రాగిస్తున్న అతనివైపు కృతజ్ఞతగా చూస్తూ నెమ్మదిగా లేచి కూర్చున్నాడు అహింసకుడు.

మాట తీరు కర్కశంగా, మనిషి భీకరంగా కనిస్తున్నా తనను ఆదుకున్న అతనిపట్ల గౌరవ భావంతో చూస్తూ మీ సహాయానికి కృతజ్ఞుడిని. అయినా గురుద్రోహి అనే నిందతో సమాజ బహిష్కృతుడినై బ్రతకంకన్నా చనిపోయుంటే బాగుండేదనిపిస్తున్నది నాకు'' అన్నాడు బాధ నిండిన కంఠంతో.

ఆ మాటలకు పెద్దగా నవ్వాడతను.

''అలా అనుకోవడం పిరికివాళ్ల లక్షణం. నీవు చూస్తే యువకుడివి, భుజబలం వున్నవాడివి. నిన్ను అన్యాయంగా వెలివేసిన సమాజంమీద పగ సాధించు. నన్ను చూడు. నా భుజబలంతో అందరినీ గజగజలాడిస్తున్నాను. ధనవంతులను దోచుకుని హాయిగా జీవిస్తున్నాను. నీవు కూడా నాలాగే బ్రతకడా నికి ఎందుకు ప్రయత్నించకూడదు?'' అన్నాడు తనకు తోచిన రీతిలో అనునయిస్తూ.

తానున్న పరిస్థితిలో అతనన్న మాటలు మంత్రవా క్కులా ప్రభావం చూపాయి అహింసకుడిమీద! అంతే! ఆ రోజునుండి పగ సాధించడమే తన ధ్యేయంగా ఆ దారిన వెళ్ళే వారినందరినీ దోచుకో వడం ప్రారంభించాడు అహింసకుడి స్థానంలో రూపు దిద్దుకున్న అంగుళిమాలుడు!

• • •

గతాన్ని తలచుకుంటూ భారమైన హృదయంతో అసహనంగా బాటవైపు చూస్తున్న అంగుళిమాలుడి ముఖం విప్పారింది దూరంనుండి ఎవరో నడిచి వస్తుండడం చూసి!

''ఎవరో ఆ వ్యక్తి! వంటరిగా, నిదానంగా, నిర్భ యంగా నడిచివస్తున్న ఆ తీరు చూస్తుంటే ఈ ప్రాంతం తనదనీ, తన పేరు వింటేనే అందరూ గడగ డలాడతారని ఎరగనట్టున్నాడు. లేకపోతే ఇలా వంటరి గావచ్చే సాహసం చేస్తాడా? కాషాంబరాలు ధరించి వున్నట్లుగా తోస్తోంది. ఇన్ని రోజులుగా ఏమీ దొరకని తను ఈ వ్యక్తిని విడిచి పెట్టకూడదు. అతని సర్వస్వం దోచుకోవాలి, చిటికెన వ్రేళ్లతో సహా!

ఉత్సాహం తెచ్చుకుని గబగబా చెట్టు దిగి కత్తి ఎత్తి పట్టుకుని ''నిలు నిలు బాటసారి! అడుగు ముందుకు వేయకు'' అని భీకరంగా అరుస్తూ వెను కనుండి ఆ వ్యక్తిని సమీపించబోయాడు.

ఆశ్చర్యం! తానెంత త్వరగా పరుగెత్తినా నింపాదిగా నడుస్తున్న ఆ వ్యక్తికి నాలుగడుగులు వెనకే వుంటు న్నాడు. ఎంత ప్రయత్నించినా ఆ మనిషిని ఒడిసి పట్టుకోవడానికిగానీ, దాటి ముందుకు వెళ్లడానికిగానీ సాధ్యంకాలేదు అంగుళిమాలుడికి! పరుగెత్తి పరుగెత్తి అలసటతో రొప్పుతూ ''ఓ బాటసారి! కాస్త ఆగు. ఒక్కసారి వెనుదిరి చూడు'' అన్నాడు అతికష్టంమీద గొంతు పెగల్చుకుని.

అప్పటికి ఆగి వెనుదిరిగి చూస్తూ ''ఎవరు నాయనా నీవు? ఎందుకు పిలిచావు?'' అడిగాడు శాంత గంభీ రస్వరంతో బాటసారి.

ఆ మాటలకు చిరాకు, కోపం ముంచుకువస్తుంటే ''ఎంతసేపటినుండో పిలుస్తూ వెంబడిస్తుంటే ఆగ కుండా అలా నడిచి పోతూనే ఉన్నావే! పరుగెత్తి పరు గెత్తి విసుగెత్తిపోయాను నేనే. సరే ఇకనైనా మర్యాదగా నీ దగ్గరవున్న అమూల్యమైన వస్తువులన్నీ తీసి అక్కడ పెట్టు. నేనసలే మంచివాడినికాను. నన్ను చూస్తే భయం కలగడంలేదా నీకు?'' అన్నాడు దగ్గరకు వచ్చి కర్కశంగా అంగుళిమాలుడు!

చిరునవ్వుతూ చూస్తూ ''నా బిడ్డలాంటి నిన్ను చూస్తే భయమెందుకు? ప్రేమా, వాత్సల్యం కలుగు తున్నాయి. పరుగెత్తి అలసిపోయానంటున్నావు నన్ను పట్టుకోలేక. అసలు నేను ఇక్కడనుండి కదలనేలేదే!'' అన్నాడా వ్యక్తి నింపాదిగా.

ఆ మాటలతో మరింతగా చిరాకు ఎక్కువైంది అంగుళిమాలుడికి!

''ఏమిటీ నేను పరుగెత్తుతుంటే నీవు మాత్రం ఒక్క చోటే నిలబడి వున్నావా? నాతో పరిహాసం మంచిది కాదు. నీ ప్రాణాలమీద ఆశ లేదా నీకు?'' అన్నాడు భయపెట్టే ధోరణిలో.

''అశాశ్వతమైన ప్రాణం మీద ఆశ ఎందుకు? నేను నిజమే చెబుతున్నాను. నీ హృదయం దేనికోసమో పరి తపిస్తున్నది. అదేమిటో తెలుసుకోలేక నీవు పరుగులు పెడుతున్నావు. నీ కోపం, చిరాకు అవతలపెట్టి కాస్త నిదానంగా ఆలోచించి చూడు'' ఆప్యాయంగా పలి కాడు కాషాయాంబరధారి.

''ప్రాణంమీద ఆశలేదా నీకు? అయితే కాచుకో. ఒక్క వేటుతో నీ తల నరికి నీ సర్వస్వం నా స్వాధీనం చేసుకుంటాను'' కత్తి ఎత్తిపట్టి దూకుడుగా ముందు కువచ్చిన అంగుళిమాలుడు విద్యుద్ఘాతం తగిలిన ట్లుగా స్తంభించిపోయాడు.

దివ్యతేజంతో వెలుగొందుతున్న ఆ వ్యక్తి కళ్లల్లోకి చూస్తూ అప్రయత్నంగా కత్తిని చేతిలోనుండి జారవిడి చాడు.

''స్వామీ! మీరెవరో మహిమాన్వితులు. మిమ్మల్ని చంపే శక్తి నా చేతులకు లేదు. నన్ను క్షమించండి'' అంటూ పాదాలమీద మోకరిల్లాడు. అతని కళ్లనుండి అశ్రుధారలు జలజల రాలి పాదాలను కడుగుతు న్నాయి. ఆ కన్నీటి ధారలలో అంతవరకూ తన హృద యంలో పేరుకుపోయిన క్రూరత్వం, అశాంతి అన్నీ వెలికివచ్చి ఏదో తెలియని ప్రశాంతత మనస్సులో చోటు చేసుకున్నట్లు అనుభూతి చెందాడు అంగుళి మాలుడు.

''లే నాయనా! ఇంతవరకూ నీ క్రూరత్వాన్నే చవి చూసిన ఈ సంఘంలో నీవు చేయవలసిన మంచి కార్యాలెన్నో వున్నాయి. పద వెళదాం!'' అంటూ లేవ నెత్తి చిరునవ్వుతో ముందుకు సాగుతుంటే మంత్రము గ్ధుడిలా అనుసరించాడు అంగుళిమాలుడు.

ఇద్దరూ అడవి మార్గం దాటి ఒక ఆరామాన్ని చేరు కున్నారు.

''బుద్ధం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!'' అని గొంతెత్తి నినదిస్తూ సాగివచ్చి ఆయనకు నమస్కరిస్తున్న వారందరివైపు ఆశ్చర్యంగా చూస్తున్న అంగుళిమాలుడి శరీరం భక్తి పారవశ్యంతో గగిర్పొడిచింది.

''తానింతవరకూ అనుసరించి వచ్చింది సాక్షాత్తూ బుద్ధ భగవానుడినా? నిజంగా తానెంతటి అదృష్టవం తుడు!'' ఆనందాశ్చర్యాలు ముప్పిరిగొన్న హృదయం మూగబోయింది.

''తండ్రీ! పాపాత్ములను ఉద్ధరించడమే నీ పనిగా పెట్టుకున్న పరమ పావన చరిత్రుడివి. నీ ఆగమనంతో అంగుళిమాలుడు, హింసకు ప్రతిరూపుడు ఈ శరీరం లోనుండి నిర్గమించాడు. జ్ఞానజ్యోతిని ప్రజ్వలింపజేసే నీ అడుగుజాడలలో నా శేష జీవితాన్ని గడిపే అదృ ష్టాన్ని ప్రసాదించు'' అంటూ మొరపెట్టుకున్నాడు ఆ కరుణామూర్తికి వినిపించేలా నిశ్శబ్దంగా.

ఆ రోజు వైశాఖ శుద్ధ పూర్ణిమ. బుద్ధ భగవానుని జన్మదినం. విశ్వమానవ శ్రేయస్సు కోసం 'అహింసా పరమోధర్మః' అంటూ చాటిచెప్పిన బౌద్ధ మతానికి మూల పురుషుడైన ఆ మహనీయుని ఆగమనం ఎందరో పాపాత్ములను పునీతులను చేసింది. ఆ భగ వానుని ధర్మబోధనలకు ప్రభావితులై ఎందరో శిష్యులై వారిని సేవించి తమ జన్మలు ధన్యం చేసుకుంటు న్నారు. ఆకాశంలోని నిండు చంద్రుని తేజం బుద్ధ భగవానుని వదనంలో కేంద్రీకృతమైంది. కళ్లలో కరుణ జాలువారుతుంటే అంగుళిమాలుని వైపు ప్రసన్నంగా చూస్తూ–

''ఇకపై బౌద్ధ భిక్షువుగా దీక్ష స్వీకరించి మానవాళి శ్రేయస్సుకోసం శ్రమించు'' అంటూ ఆనతిచ్చాడు.

''మీ ఆజ్ఞ శిరసావహిస్తాను తండ్రీ'' అంటూ బౌద్ధ భిక్షువుగా మారి జీవితం సార్ధకం చేసుకున్నాడు తిరిగి అహింసకుడుగా మారిన అంగుళిమాలుడు!

**–డా. టి. కళ్యాణీ సచ్చిదానందం**